క్లుప్తంగా

ఈ నెల 8 నుంచి బస్సుపాసులు

పీలేరు రూరల్ : ఈ విద్యా సంవత్సరానికిగాను ఈ నెల 8వ తేదీ నుంచి విద్యార్థులకు బస్సు పాసులు పంపిణీ చేస్తున్న డీఎం కుమార్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బస్సు పాసులు మాడ్యూల్ సర్వర్ అప్‌డేట్ చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 8 నుంచి వికలాంగులు తోపాటు అన్ని రకాల రాయితీ పాసులు ఇవ్వనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయస్థాయి క్విజ్‌పోటీలకు ఎంపిక



క్విజ్‌పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి

మదనపల్లె : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీ మార్కెట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్ పోటీలకు పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల దేశ వ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్ లో భాగంగా ఆన్‌లైన్‌లో డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కే.రిషిత, టి.సుజితలు ముంబైలో జరిగే ఫైనాన్స్ క్విజ్ పోటీలకు ఎంపికయ్యారు. వీరికి క్విజ్ నిర్వాహకులు ఈనెల 30వ తేదీన 25 వేల రూపాయలు నగదు బహుమతి అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర తెలిపారు. జాతీయ స్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

పింఛన్ల కోసం క్యూ



మినీ ఎస్‌బీఐ వద్ద క్యూ కట్టిన పింఛన్‌దారులు

పెద్దతిప్పసముద్రం: ప్రతి నెలా సూర్యోదయానికి ముందే వలంటీర్లు తమ గడప వద్దకే వచ్చి మాకు నిద్ర లేపి పింఛన్ డబ్బులు అందజేసేవారు.. చంద్రబాబు కారణంగా మాకు ఈ కష్టాలు వచ్చాయని పండుటాకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండల కేంద్రంలో పలువురు పింఛన్‌దారులు బ్యాంకుల వద్ద ఉదయం నుంచి క్యూ కట్టారు. గత రెండు నెలల నుంచి సుదూర ప్రాంతాల నుంచి అష్ట కష్టాలు పడి, మరి కొందరు ఆటోలు బాడుగకు మాట్లాడుకుని మండల కేంద్రానికి వచ్చి మండుటెండలో బ్యాంకుల వద్ద నిలబడి పింఛన్ సొమ్ము తీసుకోవాల్సిన దౌర్భాగ్య స్థితి నెలకొందని వారు వాపోయారు.

పౌష్టికాహారం అందించాలి
–సీడీపీఓ రాజమ్మ



మాట్లాడుతున్న సీడీపీఓ రాజమ్మ

కలకడ : ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బంది విధిగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని వాయల్పాడు ప్రాజెక్ట్ అధికారి రాజమ్మ ఆదేశించారు. సోమవారం మండలంలోని కోన, ఎర్రకోట పల్లె పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లె అంగన్‌వాడి కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బందికి సెక్టార్ సమావేశం ఏర్పాటు చేశారు. రోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రతి కేంద్రం తెరచి ఉండాలన్నారు. చిన్నారులకు 10వతేదీ లోపు ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు, ఆరోగ్యంపై పూర్తి సమాచారం రికార్డులో నమోదు చేయాలన్నారు. పౌష్టికాహారం అందలేదని ఎలాంటి ఫిర్యాదులు అందినా సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి కేంద్రంలో కనీస సౌకర్యాలు ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యశోదరాణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యం వెలికితీయడానికే పోటీపరీక్షలు



విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ అధికారి అమరనాథ

కలకడ : విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడానికి గ్రంథాలయంలో పోటీ పరీక్షలు నిర్వహించినట్లు గ్రంథాలయ శాఖాధికారి అమరనాథ తెలిపారు. వేసవి శిక్షణ శిబిరం లో కథల పుస్తకాలు చదవడం, కథలు వినిపించడం, డ్రాయింగ్, చెస్, క్యారంబోర్డ్ ఆటల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను స్థానిక గ్రంథాలయశాఖలో సోమవారం అందజేశారు. ప్రతి రోజు ఉదయం 8గంటల నుంచి 11.30గంటల వరకు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు.

మదనపల్లె మకుటం ఎవరిదో..!


- 21 రోజుల ఉత్కంఠకు నేడే తెర
- వైఎస్సార్ సీపీ, టీడీపీల మధ్యే ప్రధాన పోటీ
- క్షేత్రస్థాయి లెక్కలతో ధీమాగా వైఎస్సార్ సీపీ
- కీలక సర్వే సంస్థలన్నీ వైఎస్సార్ సీపీకే పట్టం



మదనపల్లెలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు (ఫైల్)

మదనపల్లె : జిల్లాలో ప్రశాంతతకు మారుపేరుగా, మేధావులు, విద్యావంతుల నిలయంగా మదనపల్లె నియోజకవర్గం ప్రత్యేకతను సంతరించుకుంది. మదనపల్లె నియోజకవర్గాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని ఎన్నికల్లో ప్రధాన పార్టీలు హోరాహోరీగా తలపడ్డాయి. నియోజకవర్గంలో రెండుదఫాలుగా విజయం సాధిస్తూ వస్తున్న వైఎస్సార్ సీపీ, హ్యాట్రిక్ విజయం సాధించాలని సర్వశక్తులు ఒడ్డింది. జగనన్న ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందడం, నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధిపనులు జరగడం, ప్రతి గ్రామంలోనూ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్‌క్లినిక్‌ల పేరుతో భవనాల నిర్మాణం, పాలన ప్రజల గడప వద్దకే తీసుకెళ్లడం వైఎస్సార్ సీపీ గెలుపుకు దోహదం చేసే అంశాలు. ఇవే కాకుండా ఎమ్మెల్యే అభ్యర్థి మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తి కావడం, విద్యావంతుడు, వివాదరహితుడు, మాజీ ప్రభుత్వ ఉద్యోగి కావడం, ఆరునెలలుగా ప్రతి గడపకు వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకుని, ప్రభుత్వం చేసిన మంచిని వివరించడంతో గెలుపు తమదేనన్న ధీమా వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కనిపిస్తోంది. ఇక టీడీపీ విషయానికి వస్తే పోల్ మేనేజ్‌మెంట్‌లో వైఫల్యం, అనేక పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఏజెంట్లను నియమించలేకపోవడం, ఎమ్మెల్యే అభ్యర్థిపై అవినీతి ఆరోపణలు ఉండటం నష్టాన్ని కలుగజేసే అంశాలు. ఇవే కాకుండా ఈనెల1వతేదీ సాయంత్రం అనేక సర్వే సంస్థలు ప్రకటించిన ఎగ్జిట్‌పోల్స్‌లోనూ మదనపల్లె వైఎస్సార్ సీపీదేనని తేల్చడంతో పైపైన గాంభీర్యం ప్రకటిస్తున్నా లోలోన భయంతో టీడీపీ సతమతమవుతోంది.

మదనపల్లె నియోజకవర్గం		
పోలైన మొత్తం ఓట్లు	:	2,00, 247
మదనపల్లె రూరల్	:	67,234
మదనపల్లె అర్బన్	:	77,969
నిమ్మనపల్లె	:	22,125
రామసముద్రం	:	32,929



75.11 శాతం పోలింగ్ :
మదనపల్లె నియోజకవర్గంలోని 259 పోలింగ్ కేంద్రాల్లో మే 13న 2లక్షల347 మంది ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె మండలాలతో పాటు పట్టణంలో మొత్తంగా 75.11 శాతం పోలింగ్ జరిగింది. రామసముద్రం మండలంలో 83.66 శాతం, నిమ్మనపల్లె 84.87, మదనపల్లె రూరల్ 78.42, అర్బన్ 67.54 శాతం ఓట్లు నమోదయ్యాయి. గత ఎన్నికల కంటే ఈ దఫా పోలింగ్ శాతం పెరిగింది. ఇది తమకంటే తమకు అనుకూలమని ఇరుపార్టీలు లెక్కలు వేసుకుంటున్నాయి. జగన్‌మోహన్ రెడ్డిపై ప్రజలకు ఉన్న నమ్మకం, ప్రతి పేదవాడి మనసులో నిలిచిపోయిన వైఎస్సార్ సీపీ నవరత్నాలు, ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమం, ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధితో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమన్న ధీమాతో అభ్యర్థి నిసార్‌అహ్మద్ ఉన్నారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే నవాజ్‌బాషా, టీడీపీ అభ్యర్థి దొమ్మలపాటి రమేష్‌పై 29,648 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. టీడీపీకి కంచుకోటగా చెప్పుకునే రామసముద్రం మండలంలో ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి బలం బాగా పెరగడం, ఓటింగ్ శాతం తక్కువగా నమోదయ్యే పట్టణంలో పోలింగ్ శాతం పెరగడం... వైఎస్సార్ సీపీకి లాభించే అంశాలని విశ్లేషకులు భావిస్తున్నారు. దీనికితోడు టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషాకు..సీనియర్ నాయకులు, క్యాడర్ సహకరించకపోవడం, ఎన్నికల చివరి మూడురోజులు షాజహాన్‌బాషా ఒంటెద్దు పోకడలకు పోవడం, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలను దూరం చేసుకోవడం, ప్రచారంలో వెనుకబడటం విజయావకాశాలను దెబ్బతీశాయని చెప్పవచ్చు. మదనపల్లెలో మాత్రం వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని విశ్లేషకులు భావిస్తున్నారు.

కౌంటింగ్ డౌన్ స్టార్ట్

- ఫలితం మరికొద్ది గంటల్లో...
- అందరిలో పెరుగుతున్న ఉత్కంఠ
- మధ్యాహ్నం 12గంటలకు వరించనున్న విజయం

మదనపల్లె : సార్వత్రిక ఎన్నికలు–2024 ఫలితాలకు సంబంధించి కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. ఇప్పటివరకూ విశ్రాంతిలో ఉన్న నాయకులంతా తమ అనుచరగణాన్ని వెంటబెట్టుకుని అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రాయచోటికి బయలుదేరి వెళ్లారు. మరికొద్దిగంటల్లో ప్రారంభం కానున్న కౌంటింగ్‌కు సంబంధించిన ఫలితాల కోసం ప్రజలంతా ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. 21 రోజుల సుదీర్ఘ నిరీక్షణకు మధ్యాహ్నం 12గంటలకు వెలువడనున్న విజేత ప్రకటనతో తెర పడనుంది.

బరిలో 15 మంది అభ్యర్థులు :
164–మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. జాతీయ, రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు నలుగురు, రిజిస్టర్ అయిన పార్టీల నుంచి ముగ్గురు అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులుగా ఎనిమిది మంది పోటీ చేశారు. నియోజకవర్గంలోని మొత్తం 259 పోలింగ్ కేంద్రాలకు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అసెంబ్లీకి 315, పార్లమెంటుకు 630 ఈవీఎంలతో ఎన్నికల తంతు నిర్వహించారు. బరిలో 15 మంది అభ్యర్థులున్నప్పటికీ, ప్రధానంగా వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్యే ముఖాముఖి పోరు నడిచింది. వైఎస్సార్ సీపీ నుంచి నిసార్‌అహ్మద్, టీడీపీ నుంచి షాజహాన్‌బాషాలు నువ్వానేనా అన్నరీతిలో తలపడ్డారు.

లెక్కింపు ఇలా..
మొదట కౌంటింగ్ ప్రక్రియ పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభమవుతుంది. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించిన అరగంట తర్వాత ఈవీఎం కౌంటింగ్ మొదలవుతుంది. రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపుకు సంబంధించి మొత్తం 19 రౌండ్లుగా విభజించి, 14 టేబుళ్లను ఏర్పాటుచేశారు. పార్లమెంటు అభ్యర్థికి ఇదే విధంగా ఉంటుంది. ఒకో అభ్యర్థికి 12మంది చొప్పున ఏజెంట్లను అనుమతించనున్నారు.

మేకలవాండ్లపల్లెతో ప్రారంభం..
మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి 259 పోలింగ్ కేంద్రాలు ఉంటే.. మొదట మదనపల్లె మండలం మేకలవాండ్లపల్లె 1వ పోలింగ్ కేంద్రంతో ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. మదనపల్లె మండలంలో 1 నుంచి 87 వరకు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మదనపల్లె అర్బన్‌లో 88వ పోలింగ్ కేంద్రం నుంచి 198 వరకు, నిమ్మనపల్లె మండలంలో 199వ పోలింగ్ కేంద్రం నుంచి 222 వరకు ఉంటే, రామసముద్రం మండలంలో 223వ పోలింగ్ కేంద్రంతో ప్రారంభమై 259 పోలింగ్ కేంద్రం మూగవాడితో ఓట్ల లెక్కింపు ముగుస్తుంది.

వేడుకగా సీతారామ కల్యాణ మహోత్సవం

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- రూ.31 వేలు పలికిన స్వామివారి లడ్డూ



సీతారామ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న పూజారులు

నిమ్మనపల్లె : మండల కేంద్రమైన నిమ్మనపల్లెలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో, హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా, ఆదివారం రాత్రి శ్రీ భద్రాద్రి సీతారామ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద బహిరంగ వేదికపై, వందల సంఖ్యలోని భక్తులు హాజరవగా వేద మంత్రోచ్చారణలతో పూజారులు కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం 9 కిలోల దేవుని లడ్డూ వేలం నిర్వహించారు. రూ.31 వేల ధరకు చిత్తూరుకు చెందిన శశికుమార్ స్వామివారి దక్కించుకున్నారు. ప్రత్యేకంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. సోమవారం పగలు తిరనాల కోలాహలంగా జరిగింది. సాయంత్రం ఉట్ల మాను ఉత్సవం స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఉట్ల మాను ఎక్కేందుకు యువకులు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. అడుసుపల్లెకు చెందిన మహేష్ విజేతగా నిలవగా, రూ.1,116 నగదు బహుమతిగా అందజేశారు.

శతాబ్దాల నాటి నిలువురాయి తొలగింపు



జేసీబీతో తొలగించిన ఏళ్లనాటి నిలువురాయి

కురబలకోట: అంగళ్లు సమీపంలో ఉన్న కనసానివారిపల్లె వద్ద పొలాల్లో శతాబ్దాలుగా ఉన్న పురాతన నిలువు రాయిని తొలగించారు. పొలాల్లో నిలువుగా ఈ రాయి ఉండడంతో నిలువురాయిగా పిలిచేవారు. ఇది ఉన్న పొలాల మీదుగా కొత్తగా బైపాస్ రోడ్డు వేస్తున్నారు. ఆగ్రామ యువ రైతు సుధీర్ రెడ్డి ఆధీనంలో ఈ రాయి ఉన్న పొలం ఉంది. ములకలచెరువు నుంచి మదనపల్లె (ఎన్‌హెచ్ 42) వరకు రూ.480 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా దొమ్మన్నబావి నుంచి వస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో ఈ పురాతన రాయి ఉంది. అధికారులు సూచనలతో గ్రామస్థుల సహకారంతో కాంట్రాక్టర్లు దీనిని తొలగించక తప్పలేదు. తరాలుగా ఉన్న రాయిని జేసీబీతో తొలగించినట్లు ఆ గ్రామ సర్పంచ్ కనసాని కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు వన్నూ కొండారెడ్డి, యువ నాయకులు సుధీర్ రెడ్డి సోమవారం వెల్లడించారు. ఎలాంటి చిహ్నాలు, లిపి కూడా లేని అరుదైన ఈ పురాతన నిలువురాయి ఎప్పటి నుంచి ఉందో ఏ చరిత్రకు ఇది ఆనవాలో పెద్ద తరం వారు కూడా చెప్పలేకపోయారు. నాలుగైదు తరాలకు ముందు నుంచి ఉన్నట్లు పరంపరగా వస్తున్న పెద్ద తరం వారు చెప్పేవారు. పండగలు, పర్వదినాల సందర్భాల్లో ఇక్కడ గ్రామస్థులు పూజలు చేసేవారు. ఇది భూమిపై 12 అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పుతో అడుగుకు పైగా మందంతో ఉండేది. భూ మట్టం నుంచి కింద నాల్గు అడుగుల లోతున ఈ రాయి ఉన్నట్లు దీన్ని తొలగించినప్పుడు చూసిన గ్రామస్థులు వెల్లడించారు. తరాల నాటి ఈ పురాతన నిలువు రాయి గురించి స్థానికులు ఆసక్తికర ఆపై ఆశ్చర్యకర సంగతులు విన్పించేవి. దీనిని ఎవరు ఎందుకు నాటారో.. దీని మిస్టరీ ఏమిటన్నది సమాధానం దొరకని ప్రశ్నగానే మిగిలిపోయింది. బైపాస్‌కు అడ్డుగా ఉందన్న కారణంగా దీనిని ఇప్పుడు పూర్తిగా తొలగించడంతో తీపి గురుతుగా ఉన్న దీని ఆనవాళ్లు కూడా కనమరుగయ్యాయి. రచయిత, పలమనేరు బత్తనపల్లె మునిరత్నం రెడ్డి మాట్లాడుతూ వెయ్యేళ్లకు ముందు నుంచి ఈ నిలువురాయి ఉండవచ్చని తెలిపారు. పూర్వికులు కొందరు సమాధికి చిహ్నంగా ఇలాంటి నిలువురాళ్లు నాటేవారన్నారు. ఇలాంటివి తెలంగాణా, ఉత్తరాంధ్ర, నెల్లూరు ప్రాంతాల్లో ఇప్పటికీ కన్పిస్తాయన్నారు. రాయలసీమలో అరుదన్నారు. అలాంటి వాటిలో ఇది కూడా ఒకటై ఉండి ఉండవచ్చని వ్యక్తం చేశారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ కో ఎడుయకేషన్ కాలేజీగా మార్పు చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపిసి, సీఈసీ ఇంగ్లీషు మీడియం ఉన్నాయన్నారు. గ్రూపునకు 40 సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్‌లో చేరే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనుభవం కలిగిన అధ్యాపకులు, ల్యాబ్, క్రీడా స్థలం, డిజిటల్ బోధనతో పాటు అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా నల్లగంగమ్మ తిరునాల



ప్రత్యేకాలంకరణలో నల్లగంగమ్మ

కేవీపల్లె : మండలంలోని సారకాయలపేట పంచాయతీ మిన్నంరెడ్డిగారిపల్లెలో నల్లగంగమ్మ తిరునాల అంగరంగ వైభవంగా జరిగింది. రెండు రోజులగా అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి సోమవారం ఉదయం వరకు చాందినీ బండ్లు ఆలయ ప్రదక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సోమవారం ఉదయం పరిసర గ్రామాల భక్తులు అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

నేడు నందీశ్వరునికి అభిషేకం

మదనపల్లె సిటీ: స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం బాహ్య నందీశ్వరస్వామికి అభిషేకం చేయనున్నట్లు ఆలయ ఈఓ రమణ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు త్రయోదశి ప్రదోషం సందర్భంగా విశేషంగ అభిషేకం జరుగుతుందన్నారు. భక్తులు పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆరోగ్య సంరక్షణ సేవలు బలోపేతం చేద్దాం



సమీక్షా సమావేశంలో డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : వ్యాధులు లేని గ్రామాలు నిర్మించడమే లక్ష్యంగా ఆరోగ్య సంరక్షణ సేవలు బలోపేతం చేద్దామని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం సీహెచ్‌ఓలతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శిశుఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యక్తిగత, పరిసర పరిశుభ్రత, తాగునీటి శుభ్రత తదితర అంశాలపై సాధించిన ఫలితాలు ఆరా తీశారు. మంచి ఆరోగ్య సూత్రాలతో ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలన్నారు.

సమష్టి కృషితో మలేరియాను నివారిద్దాం
సమష్టి కృషితో మలేరియా వ్యాధిని నివారిద్దామని మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్ అన్నారు. సోమవారం పీలేరు పట్టణంలోని పద్మావతి నగర్‌లో మలాథియన్ స్ప్రే చేపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, పర్యవేక్షకులు శ్రీనివాసులు, కుసుమ, ఏఎన్‌ఎం విజయకుమారి, వెంకటరత్నం, సీహెచ్‌ఓ ఆయేషా పాల్గొన్నారు.

రౌద్రముఖి స్ఫూర్తితో లఘుచిత్రాలు



రౌద్రముఖి లఘుచిత్రం సక్సెస్‌మీట్‌లో చిత్రబృందం

పీలేరు : రెండు రోజుల క్రితం విడుదలైన రౌద్రముఖి లఘుచిత్రం స్ఫూర్తితో ఇక ముందు కూడా మంచి మంచి లఘుచిత్రాలు నిర్మిస్తామని ఆ చిత్ర నిర్మాత సురేష్, దర్శకుడు సుహేల్ అన్నారు. సోమవారం స్థానిక ఎంఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్ లో రౌద్రముఖి చిత్రం సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూఢ నమ్మకాలు, దైవభక్తి, గూడెం ప్రజల జీవనశైలి నేపథ్యంలో రూపొందించి యూ ట్యూబ్‌లో విడుదలైన రౌద్రముఖి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నటీనటులు ఆల్ ది బెస్ట్ ఖాదర్‌బాషా, బాబ్జాన్, రాధాకృష్ణ, విజయ్, కృష్ణ, మల్లికార్జున, రాజు, మహేష్, గోపి, మధు, ఆరాధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పీలేరు రూరల్ : కౌంటింగ్ రోజున మంగళవారం ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పీలేరు పట్టణంలోని యల్లమంద క్రాస్, కోటపల్లె, తిరుపతి రోడ్డు తదితర ప్రాంతాల్లో స్పెషల్ పోలీసులచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మంగళవారం రాయిచోటి సాయి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పీలేరు పట్టణంలో 144 సెక్షన్, పోలీస్ 30 యాక్టు అమల్లో ఉంటుందన్నారు. పీలేరులో మంగళవారం జరిగే వారపు సంతను రద్దు చేసినట్లు తెలిపారు. టీ దుకాణాలు, ఇతర దుకాణాలు మూసివేయాలని కోరారు. లాడ్జీల్లో, కల్యాణ మండపాల్లో గుమికూడరాదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి విజయోత్సవాలు, ర్యాలీలు, సంబరాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఎస్‌ఐ నరసింహుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట : కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. సోమవారం ఆకేపాటి ఎస్టేట్‌లో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాలలో అనుసరించాల్సిన అంశాలు గురించి తెలియజేశారు. కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లు చివరి వరకు పూర్తిగా ఉండాలన్నారు. అభ్యర్థులకు డిక్లరేషన్ ఫారమ్ ప్రకటించేంత వరకు కౌంటింగ్ కేంద్రాన్ని విడిచి బయటకు రాకూడదన్నారు. ఏజెంట్లు కౌంటింగ్ నిబంధనలను పాటించాలన్నారు. ఎన్నికల సంఘం విధించిన నియమ నిబంధనలను ఏజెంట్‌లు కచ్చితంగా పాటించాలన్నారు. మంగళవారం తెల్లవారుజామునే కౌంటింగ్ కేంద్రానికి చేరాలన్నారు.

విద్య, ఉద్యోగావకాశాలపై అవగాహన



మాట్లాడుతున్న నార్త్ స్టార్ అకాడమీ డైరెక్టర్ ఇర్ఫాత్

పీలేరు : డిగ్రీ చదువుతో మంచి ఉద్యోగాలు సాధించవచ్చునని నార్త్ స్టార్ అకాడమీ డైరెక్టర్ ఇర్ఫాత్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సీఎస్‌ఆర్ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్ తరువాత విద్య, ఉద్యోగావకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన సాంకేతిక ఆర్థిక జీవనోపాదుల నేపథ్యంలో డిగ్రీతో ఉద్యోగవకాశాలు ఉన్నాయన్నారు. డిగ్రీలో తమ తృతీయ ఏడాదిట టెస్టింగ్ టూల్స్, డాట్ నెట్, ఎస్‌ఏపీఐసీడబ్ల్యూ, ఏసీఎం ఏఆబాట్‌ల్యాబ్, సైన్స్ వెబ్ టెక్నాలజీస్ వంటి సాంకేతిక కోర్సులు నేర్చుకుంటే ఉద్యోగం పొందవచ్చునని తెలిపారు. బీటెక్, ఎంబీఏ చదివిన వారు కూడా పై సాంకేతిక పోస్టులు నేర్చుకున్న అనంతరం సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు పొందుతున్నాని తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు ప్రతిమ, శ్రీనివాస్, హరిచందన్, శ్రీనివాస్, వెంకటోరెడ్డి, బాలకృష్ణ, స్వాతి, వేణుగోపాల్‌రెడ్డి, మల్లికార్జున, మోహన్‌బాబు, కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని ప్రార్థనలు



అంగళ్లులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నాయకులు

కురబలకోట: వైఎస్సార్ సీపీ విజయదంభా మోగించి మరోసారి వైఎస్ జగన్ సీఎం కావాలని కోరుతూ తంబళ్లపల్లె నియోజక వర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు అజారుద్దీన్ నివాసంలో సోమవారం మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బడుగు బలహీన వర్గాల వారికి జగన్ సీఎం కావడం చాలా అవసరమని తెలిపారు. అంగళ్లు సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి, రెడ్డి కుమారి, ముత్ర దామోదర్ రెడ్డి, పోరెడ్డి ఎల్లారెడ్డి, రామిగాని శంకర్, అమ్మాజీ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనకాయల పంపిణీ

జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్



విత్తన కాయల నాణ్యతపై రైతులను అడిగి తెలుసుకొంటున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

గుర్రంకొండ: రైతులకు నాణ్యమైన విత్తనకాయలను మాత్రమే పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్లుట్ల ఆర్బీకేలో వేరుశనగ విత్తనకాయల పంపిణీని ప్రారంభించారు. ఈసందర్భంగా విత్తనకాయల నాణ్యతపై రైతులను అడిగి తెలుసుకొన్నారు. ఆర్బీకేలో విత్తనకాయలు వచ్చిన స్టాకు పంపిణీ చేసి స్టాకు వివరాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనకాయలు నాణ్యతలేవని ఫిర్యాదు చేస్తే ఆర్బీకే సిబ్బంది వెనక్కు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది ముందుగా ఆర్బీకేల్లోనే విత్తనాల నాణ్యత పరిశీలించాలన్నారు. ఎవరైనా సిబ్బంది ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు. ఆర్బీకేల్లో విత్తనకాయలు తీసుకొన్న రైతులు తప్పనిసరిగా పొలాల్లో విత్తనాలు వేసుకోవాలన్నారు. పంటసాగుకు సంబంధించి ఈ నమోదు చేసుకోవాలన్నారు. పంట సాగు చేయకుంటే ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. కార్యక్రమంలో జిల్లా విత్తనాధికారి రమేష్‌రాజు, ఇన్‌చార్జ్ ఏఓ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎంపీఈఓ రిజ్వానా, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట సాగు చేయకుంటే పథకాలు కట్
బి.కొత్తకోట: వేరుశనగ రాయితీ విత్తనకాయలు తీసుకున్న ప్రతి రైతూ పంటను సాగు చేయాలని లేనిపక్షంలో ప్రభుత్వ పథకాలు అందవని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె ఆర్‌బీకేలో విత్తనకాయల పంపిణీ కార్యక్రమం పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంపిణీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీ విత్తనకాయలు తీసుకున్న రైతులు పంటలు సాగు చేయాలని, ఆ పంటను ఈ క్రాప్ ద్వారా నమోదు చేయడం ఖచ్చితంగా జరుగుతుందని చెప్పారు. జిల్లాలో రైతులకు పంపిణీ చేసేందుకు 55,300 క్వింటాళ్ల విత్తనకాయలను ప్రభుత్వం కేటాయించిందని, ఇందులో ఇప్పటికే 37వేల క్వింటాళ్లను పంపిణీ చేసామన్నారు. మరో వారం రోజుల్లో మిగిలిన విత్తనకాయల పంపిణీ పూర్తి చేస్తామన్నారు. ఆయనవెంట ఏడీఏ దీక్షా కుమారి, ఏఓ చంద్రశేఖర్ ఉన్నారు.